రిత్విక్‌కు కాంస్యం

● జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నాసిక్(మహారాష్ట్ర) వేదికగా జరిగిన జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో రాష్ట్ర యువ ప్లేయర్ రాజా రిత్విక్ కాంస్య పతకంతో మెరిశాడు. బుధవారంతో ముగిసిన టోర్నీలో రిత్విక్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. మొత్తం 11 రౌండ్ల పాటు జరిగిన టోర్నీలో రిత్విక్ 8.5 పాయింట్లు సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఏడు గేమ్‌లు గెలిచిన ఈ యువ జీఎం మూడు గేమ్‌లు డ్రా చేసుకోవడంతో ఒకటి ఓడిపోయాడు. రిత్విక్ ప్రస్తుతం రామరాజు దగ్గర శిక్షణ తీసుకుంటున్నాడు. జాతీయ ర్యాపిడ్ టోర్నీలో కాంస్యం సాధించిన రిత్విక్‌ను రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ అభినందించారు. భవిష్యత్‌లో రిత్విక్ మరిన్ని విజయాలు సాధిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు.

అభిమానులను ఆకట్టుకునేలా..

● ఐపీఎల్ ప్రసార చిత్రాలు

ముంబై: రానున్న ఐపీఎల్ సీజన్ కోసం ప్రసార చిత్రాలు అభిమానులను ఆకట్టుకునే రీతిలో రూపుదిద్దుకుంటున్నాయి. ముఖ్యంగా ఫ్యాన్స్‌ను దృష్టిలో పెట్టుకుంటూ లీగ్ డిజిటల్ స్పాన్సర్ జియో సినిమా లఘు చిత్రాలను రూపొందిస్తున్నది. చెన్నై సూపర్‌కింగ్స్ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీకి అభిమానుల్లో ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ప్రసార వీడియోలను సిద్ధం చేశారు. ధోనీ..తాతా మనువడు పాత్రలో ద్విపాత్రాభినయం చేసిన వీడియోను జియో సినిమా వాళ్లు విడుదల చేశారు. డిజిటల్ మీడియాలో ఐపీఎల్ నిరంతరం ప్రసారం అవుతున్న తీరును ప్రస్ఫుటిస్తూ ఈ యాడ్‌కు రూపకల్పన చేశారు. ఈ చిత్రాల్లో ధోనీ తన సహజ సిద్ధ నటనతో ఆకట్టుకున్నారు.

సింధు, శ్రీకాంత్ ముందంజ

● ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత సీనియర్ షట్లర్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ ముందంజ వేశారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో సింధు 20-22,22-20, 21-19తో మిచెల్లీ లీ(కెనడా)పై అద్భుత విజయం సాధించింది. గంటా 20నిమిషాల పాటు జరిగిన పోరులో సింధు అద్భుత పోరాటపటిమ కనబరిచింది. గాయం నుంచి తేరుకున్న తర్వాత పోటీపడుతున్న రెండో టోర్నీలో సింధు సత్తాచాటింది. తొలి గేమ్‌ను ప్రత్యర్థికి చేజార్చుకున్న ఈ తెలుగు షట్లర్ వరుస గేముల్లో లీని చిత్తు చేసింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్..21-15, 20-22, 21-8తో చౌ తీన్(చైనీస్ తైపీ)పై గెలిచి రెండో గేమ్‌లోకి దూసుకెళ్లాడు. మరో సింగిల్స్ తొలి రౌండ్‌లో హెచ్ఎస్ ప్రణయ్..17-21, 17-21తో లు గువాంగ్ జు(చైనా) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

గుజరాత్ బోణీ

ఆర్‌సీబీపై విజయం

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 19 రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)పై అద్భుత విజయం సాధించింది. ఆడిన ఐదు మ్యాచ్‌లో గుజరాత్‌కు ఇది తొలి విజయం. మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 199-5 స్కోరు చేసింది. కెప్టెన్ బేత్ మూనీ(51 బంతుల్లో 85 నాటౌట్, 12ఫోర్లు, సిక్స్), లౌరా వాల్వర్డ్ (45 బంతుల్లో 76, 13ఫోర్లు) ధనాధన్ అర్ధసెంచరీలతో అదరగొట్టారు. మిలోనెక్స్, వేర్‌హామ్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్య చేధనకు దిగిన ఆర్‌సీబీ 180-8 స్కోరు చేసింది. వేర్‌హామ్ (48) రీచా ఘోష్ (30) ఫర్వాలేదనిపించారు. గార్డ్‌నర్ (2-23) రెండు వికెట్లు తీసింది. బేత్‌మూనీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ప్రిక్వార్టర్స్‌లో సహజ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నాగ్‌పూర్(మహారాష్ట్ర) వేదికగా జరుగుతున్న మహా ఉర్జా ఐటీఎఫ్ టోర్నీలో తెలంగాణ యువ ప్లేయర్ సహజ యమ్లపల్లి సత్తా చాటింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో సహజ 3-6, 6-1, 6-1 తేడాతో వైదేహి చౌదరీపై అద్భుత విజయం సాధించి ప్రిక్వార్టర్స్‌లోకి దూసుకెళ్లింది. తొలి సెట్‌ను ప్రత్యర్థికి చేజార్చుకున్న సహజ..వరుస సెట్లలో మట్టికరిపించింది. కోర్టులో తనైదన దూకుడు కనబరిచిన ఈ యువ ప్లేయర్ బలమైన బేస్‌షాట్లు, ఫోర్‌హ్యాండ్‌లతో వైదేహిని ఉక్కిరి బిక్కిరి చేసింది.

బంగ్లాదే రెండో టీ20

శ్రీలంకపై ఘన విజయం

సిల్హెట్: శ్రీలంకతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన లంక నిర్ణీత 20 ఓవర్లలో 165-5 స్కోరు చేసింది.కమిందు మెండిస్(37), కుశాల్ మెండిస్(36), మాథ్యూస్(32 నాటౌట్) రాణించారు. తస్కిన్ అహ్మద్, మెహదీహసన్, ముస్తాఫిజుర్, సౌమ్య సర్కార్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యచేదనకు దిగిన బంగ్లా..18.1 ఓవర్లలో 170-2 స్కోరు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్(53 నాటౌట్), లిటన్‌దాస్(36)విజృంభించారు. పతిరణ రెండు వికెట్లు తీశాడు. నజ్ముల్ హుస్సేన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

పరువు కోసం ఇంగ్లండ్ తహతహ

4-1 లక్ష్యంగా..

నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ ఐదో టెస్టు ● జోరుమీదున్న టీమ్‌ఇండియా

హిమాలయ పర్వత సానువుల్లో భారత్, ఇంగ్లండ్ టెస్టు సిరీస్ ఆఖరి సమరానికి రంగం సిద్ధమైంది. చుట్టూ మంచు దుప్పటి కప్పుకున్నట్లు శ్వేత వర్ణంలో మెరిసిపోతున్న పర్వతాల మధ్య రెండు అత్యుత్తమ జట్లు తలపడబోతున్నాయి. ఇప్పటికే సిరీస్ దక్కించుకున్న టీమ్‌ఇండియా 4-1 లక్ష్యంగా బరిలోకి దిగుతుంటే..బజ్‌బాల్‌ను నమ్ముకున్న ఇంగ్లిష్ టీమ్ కనీసం పరువైనా దక్కించుకోవాలని తహతహలాడుతున్నది. రాంచీలోనే సిరీస్‌ను ఒడిసిపట్టుకున్న రోహిత్‌సేన.. ధర్మశాలలో ఇంగ్లండ్‌పై దరువు వేయాలని చూస్తున్నది.. మిగతా వేదికలకు భిన్నంగా కనిపిస్తున్న ధర్మశాల..ఆతిథ్య టీమ్‌కు అనుకూలిస్తుందా లేక ఇంగ్లండ్‌కు అన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది. ఈ మ్యాచ్ ద్వారా అశ్విన్, బెయిర్‌స్టో వందో టెస్టు మార్క్‌ను అందుకోబోతున్నారు. మొత్తంగా రెండు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగే ఆస్కారం ఉంది.

ధర్మశాల: భారత్, ఇంగ్లండ్ ఐదో టెస్టు పోరుకు సిద్ధమయ్యాయి. ధర్మశాల వేదికగా గురువారం నుంచి ఇరు జట్లు అమీతుమీ తేల్చుకునేందుకు కదనోత్సాహంతో కనిపిస్తున్నాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 3-1ఆధిక్యంలో ఉన్న టీమ్‌ఇండియా..ధర్మశాలపై జెండా ఎగురవేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నది. రాంచీ టెస్టు విజయంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న రోహిత్ సేన..ఐదో పోరులోనూ అదే దూకుడు కనబరిచేందుకు పట్టుదలతో ఉంది. మరోవైపు బజ్‌బాల్‌ను నమ్ముకుంటూ భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన బెన్‌స్టోక్స్ సేన..హైదరాబాద్ టెస్టు మినహాయిస్తే..వరుసగా మూడు టెస్టుల్లో ఓటమిపాలై సిరీస్ చేజార్చుకుంది. మిగతా వేదికల్లో పిచ్‌లతో పోలిస్తే..భిన్నంగా కనిపిస్తున్న ధర్మశాలలో భారత్‌కు దీటైన పోటీనిచ్చేందుకు ఇంగ్లిష్ టీమ్ తహతహలాడుతున్నది. ప్రస్తుత ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్న టీమ్‌ఇండియా.. ఐదో మ్యాచ్ గెలిచి తమ ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకునేందుకు చూస్తున్నది. మరోవైపు వరుస ఓటములతో కుదేలవుతున్న ఇంగ్లండ్.. బజ్‌బాల్ ప్రయోగం తర్వాత తొలి టెస్టు సిరీస్‌ను కోల్పోయిన అపప్రదను మూటగట్టుకుంది.

మార్పులు, చేర్పులతో:

ఇంగ్లండ్‌తో ఐదో పోరుకు భారత్ మార్పులు, చేర్పులతో బరిలోకి దిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా స్పిన్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తుది జట్టులోకి రానుండగా, యువ బౌలర్ ఆకాశ్‌దీప్‌సింగ్‌ను కొనసాగించాలా లేదా అన్నది సందిగ్ధంగా మారింది. ఒక వేళ పిచ్ పేస్‌కు అనుకూలించే అవకాశాలు కనిపిస్తే..బుమ్రా, సిరాజ్‌తో ఆకాశ్‌దీప్ తుది జట్టులో ఉండే అవకాశముంది. ఇదే జరిగితే చైనామన్ స్పిన్నర్ కుల్దీప్‌యాదవ్ తన స్థానాన్ని కోల్పోవాల్సి వస్తుంది. దీంతో ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్ల కాంబినేషన్‌తో టీమ్‌ఇండియా పోటీకి దిగవచ్చు. బ్యాటింగ్ విషయానికొస్తే..యువ బ్యాటర్ రజత్ పాటిదార్ వచ్చిన అవకాశాలను చేజార్చుకుంటున్నాడు. ఆడిన మూడు టెస్టుల్లో 63 పరుగులతో నిరాశపరిచాడు. పాటిదార్‌ను తిరిగి కొనసాగిస్తారా లేక దేవదత్ పడిక్కల్‌కు చాన్స్ ఇస్తారా అన్నది తేలాల్సి ఉంది. వికెట్‌కీపర్, బ్యాటర్ ధ్రువ్ జురెల్ అంచనాలకు మించి అదరగొడుతుండగా, సర్ఫరాజ్‌ఖాన్ రాంచీ టెస్టులో నిరాశపరిచిన సంగతి తెలిసిందే. విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ గైర్హాజరీలో యువ క్రికెటర్లు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు పట్టుదలతో ఉన్నారు. ఈ మ్యాచ్ ద్వారా సీనియర్ స్పిన్నర్ అశ్విన్ వంద మ్యాచ్‌ల క్లబ్‌లో చేరబోతున్నాడు. మరోవైపు ఇంగ్లండ్ టీమ్ ఇద్దరు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో భారత్‌కు పోటీనివ్వబోతున్నది. బెయిర్‌స్టో ఈ మ్యాచ్ ద్వారా వంద మ్యాచ్‌ల మైలురాయిని అందుకోబోతున్నాడు.

2 టెస్టుల్లో 700 వికెట్ల ఫీట్‌ను అందుకునేందుకు ఇంగ్లండ్ సీనియర్ పేసర్ అండర్సన్‌కు కావాల్సిన వికెట్లు

8 టెస్టుల్లో 300 వికెట్ల క్లబ్‌లో చేరేందుకు జడేజా ఎనిమిది వికెట్ల దూరంలో ఉన్నాడు.

100 ధర్మశాల టెస్టు ద్వారా అశ్విన్, బెయిర్‌స్టో 100 మ్యాచ్‌ల మైలురాయిని అందుకోబోతున్నారు.

జట్ల అంచనా

భారత్: రోహిత్‌శర్మ(కెప్టెన్), జైస్వాల్, గిల్, పాటిదార్, జడేజా, సర్ఫరాజ్‌ఖాన్, జురెల్, అశ్విన్, కుల్దీప్‌యాదవ్-ఆకాశ్‌దీప్, సిరాజ్, బుమ్రా

ఇంగ్లండ్: క్రాలే, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, స్టోక్స్(కెప్టెన్), ఫోక్స్, హార్ట్‌లే, వుడ్, బషీర్, అండర్సన్.

భారత్‌పై అమెరికా గెలుపు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హెచ్‌పీఆర్‌సీ వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎరీనా పోలో చాంపియన్‌షిప్‌లో అమెరికా 10-6తో భారత్‌పై విజయం సాధించింది. భారత్ తరపున ఆనంద్ నాలుగు గోల్స్ చేయగా, అర్‌స్లాన్‌ఖాన్, చైతన్య ఒక్కో గోల్‌తో ఆకట్టుకున్నారు.

'ఖేలో ఇండియా'తో ఉద్యోగాలు

న్యూఢిల్లీ: కేంద్ర క్రీడాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో క్షేత్రస్థాయిలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు తీసుకొచ్చిన ఖేలోఇండియా ద్వారా ప్లేయర్లకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ బుధవారం నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇప్పటి వరకు ఖేలో ఇండియా వేర్వేరు విభాగాల్లో పతకాలు సాధించిన ప్లేయర్లు ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు. ప్రధాని నరేంద్ర మోదీ విజన్ మేరకు 2018లో ఖేలో ఇండియా ప్రారంభమైంది. అప్పటి నుంచి వేర్వేరు రాష్ట్రాలు వేదికలుగా పోటీలు జరుగుతాయి.



ముచ్చటగా మూడు సినిమాలు

హీరో శర్వానంద్ బుధవారం పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొత్త చిత్రాలను ప్రకటించారు. 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో శర్వానంద్ ఓ చిత్రాన్ని చేస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మాత. బుధవారం రిలీజ్ చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో శర్వానంద్ పొడవాటి జుట్టు, గడ్డంతో రగ్గిడ్ లుక్‌లో కనిపిస్తున్నారు.

'మనమే' గ్లింప్స్ విడుదల

శర్వానంద్ 35వ చిత్రానికి 'మనమే' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. లండన్ నేపథ్యంలో జరిగే కథ ఇది. ఇక శర్వానంద్ హీరోగా యూవీ క్రియేషన్స్ సంస్థ అభిలాష్ కంకర దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం బుధవారం ప్రారంభమైంది. స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కించబోతున్న ఈ చిత్రంలో శర్వానంద్ బైక్ రైడర్‌గా కనిపిస్తారు.

రామ్ చరణ్‌తో జోడీగా..

బాలీవుడ్‌లో అనతికాలంలోనే అగ్ర నాయికల్లో ఒకరిగా పేరు తెచ్చుకుంది జాన్వీకపూర్. తెలుగులో కూడా ఈ భామకు వరుసగా భారీ అవకాశాలు వరిస్తున్నాయి. ఎన్టీఆర్ 'దేవర' చిత్రం ద్వారా ఈ అమ్మడు తెలుగులో అరంగేట్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు మరో అగ్ర హీరో రామ్‌చరణ్‌తో జోడీకట్టబోతున్నది. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రామ్‌చరణ్ పాన్ ఇండియా చిత్రంలో నటించబోతున్న విషయం తెలిసిందే. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమాలో జాన్వీకపూర్ నటిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. బుధవారం జాన్వీకపూర్ పుట్టిన రోజును పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తున్నది.

వార్-2లో గూఢచారిగా..?

యష్‌రాజ్ ఫిలింస్ బ్లాక్‌బస్టర్ 'వార్'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'వార్- 2'. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కథానాయకులుగా నటిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ ద్వారా ఎన్టీఆర్ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. తాజాగా ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్ర గురించి ఇంట్రస్టింగ్ అప్‌డేట్ వెలువడింది. ఎన్టీఆర్ ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనిపిస్తారని తొలుత వార్తలు వినిపించాయి. అయితే అవేమీ నిజం కావని, యష్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో వచ్చిన ఏజెంట్స్ తరహాలోనే ఎన్టీఆర్ సైతం పవర్‌ఫుల్ ఏజెంట్ పాత్రలో కనిపించబోతున్నారని తెలిసింది. హృతిక్‌తో కలిసి విలన్ గ్యాంగ్‌ని ఎదుర్కొనే ఏజెంట్‌గా ఎన్టీఆర్ పాత్ర అత్యంత శక్తివంతంగా ఉంటుందని అంటున్నారు. ఎన్టీఆర్ పాత్ర డిజైన్ విషయంలో దర్శకుడు అయాన్ ముఖర్జీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, బాలీవుడ్ ఎంట్రీ చిత్రం కాబట్టి ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఆయన క్యారెక్టర్‌ను తీర్చిదిద్దుతున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయిన అనంతరం ఆయన 'వార్-2' సెట్‌లో జాయిన్ అవుతారని, బహుశా మే నెలలో ఆయన ఎంట్రీ ఉండొచ్చని సమాచారం.

శివుడి ఆజ్ఞ అనుకుంటున్నా

కన్నడ చిత్రసీమలో కమర్షియల్ దర్శకుడిగా మంచి పేరు సంపాదించుకున్నారు ఏ.హర్ష. 'భీమా' చిత్రం ద్వారా ఆయన తెలుగులో అరంగేట్రం చేస్తున్నారు. గోపీచంద్ కథానాయకుడిగా కె.కె.రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఏ.హర్ష మాట్లాడుతూ 'కోవిడ్ సమయంలో ఈ కథ తయారు చేశాను. గోపీచంద్‌కు ఈ కథ బాగా నచ్చింది. యాక్షన్, ఎమోషన్స్, సెంటిమెంట్, ఫాంటసీ..ఇలా అన్ని అంశాల కలబోతగా ఉంటుంది. కథలో సెమీ ఫాంటసీ ఎలిమెంట్‌ను జత చేయడం ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు. ట్రైలర్‌లో అఘోరాలను చూపించడంతో 'అఖండ'తో పోల్చిచూస్తున్నారని, అయితే రెండు పూర్తి భిన్నమైన కథలని ఆయన తెలిపారు. 'పరశురామ క్షేత్రం నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. గోపీచంద్‌ను మునుపెన్నడూ చూడనటువంటి కొత్త పాత్రలో చూస్తారు. పోలీస్ క్యారెక్టర్‌కు సెమీ ఫాంటసీ అంశాలను జోడించడమే ఈ సినిమాలో ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అని చెప్పారు. ఈ సినిమా ఆరంభం, ముగింపు రెండూ శివుడితో ముడిపడి ఉంటాయని, మహాశివరాత్రి రోజున సినిమా రిలీజ్ కావడం శివుడి ఆజ్ఞగా భావిస్తున్నానని ఏ.హర్ష ఆనందం వ్యక్తం చేశారు.

'విశాలాక్షి' ప్రారంభం

విజయ్‌శంకర్, మహేష్ యడ్లపల్లి, ఆయూషి పటేల్, అనుశ్రీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'విశాలాక్షి' చిత్రం బుధవారం ప్రారంభమైంది. పవన్‌శంకర్ దర్శత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పల్లపు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్‌నివ్వగా, ఆర్.కె.గౌడ్ కెమెరా స్విఛాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇన్వెస్టిగేషన్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. కథలో సస్పెన్స్ ఉంటుంది. రాయలసీమ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మొత్తం నాలుగు షెడ్యూల్స్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తాం. పాటలను అరకు, ఊటీలో చిత్రీకరిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఉరుకుందరెడ్డి, సంగీతం: ఆనంద్, రచన-పాటలు-దర్శకత్వం: పవన్ శంకర్.

'ధూం ధాం' బరాత్

చేతన్‌కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'ధూం ధాం'. సాయికిషోర్ మచ్చ దర్శకుడు. ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశలో ఉంది. వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. పెళ్లి బరాత్‌లో నాయకానాయికలు హ్యాపీగా డ్యాన్స్ చేస్తున్న పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. దర్శకుడు మట్లాడుతూ 'లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. ఆద్యంతం ఆహ్లాదభరితంగా సాగుతుంది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల్ని మెప్పించే అన్ని అంశాలుంటాయి' అని తెలిపారు. సాయికుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ, శివన్నారాయణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ రామస్వామి, సంగీతం: గోపీసుందర్, కథ, స్క్రీన్‌ప్లే: గోపీ మోహన్, సంభాషణలు: ప్రవీణ్ వర్మ, దర్శకత్వం: సాయికిషోర్ మచ్చ.